
నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 7 మే 2024 | HYDERABAD

కొండాపూర్ ఆర్టీఏ ఆఫీసు వద్ద రోడ్‌షోలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

## నేడు ఖైరతాబాద్ నియోజకవర్గంలో

# కేటీఆర్ రోడ్ షో



బంజారాహిల్స్, మే 6 : ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో ఉంటుందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు గెలుపును కాంక్షిస్తూ..రాత్రి 7 గంటలకు షేక్‌పేట, జూబ్లీహిల్స్ డివిజన్ల పరిధి ఫిలింనగర్‌లోని గౌతంనగర్ చౌరస్తా, 7.30 గంటలకు బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని జహీరానగర్ చౌరస్తా, బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజిగూడ, హిమాయత్‌నగర్‌లలో రోడ్ షో, సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.



బడంగ్‌పేట గాంధీనగర్ చౌరస్తాలో మద్దతు తెలుపుతున్న మహిళలు

శంషాబాద్ బస్టాండ్ వద్ద రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## మోసాల బడేభాయ్.. కోతల చోటేభాయ్‌లకు

# ఓటుతో బుద్ధి చెబుదాం

- మోదీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సిందే
- తెలంగాణ కోసం పోరాడేది ఒక్క బీఆర్ఎస్సే
- 96 బీసీ కులాలను ఏకం చేసిన కాసానిని గెలిపించుకోవాలె
- చేవెళ్ల పార్లమెంటు పరిధిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో

సిటీబ్యూరో: పదేండ్లలో హైదరాబాద్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వని ప్రధాని నరేంద్ర మోదీకి ఈ పార్లమెంటు ఎన్నికల్లో నగర ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. 2014లో బడే భాయ్ మోదీ ఎన్నో హామీలిచ్చారని.. రూ. 15 లక్షలు, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, బుల్లెట్ ట్రైన్లు, రైతుల ఆదాయం రెట్టింపు, ప్రతి ఒక్కరికీ ఇండ్లు అని చెప్పి.. ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా కేటీఆర్ ప్రచారం నిర్వహించారు. శేరిలింగంపల్లిలోని కొండాపూర్, రాజేంద్రనగర్‌లోని శంషాబాద్ బస్టాండ్, మహేశ్వరంలోని బడంగ్‌పేట గాంధీనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో కేటీఆర్ ప్రసంగించారు. ముస్లింపై మోదీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, పదేండ్లుగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ఎప్పుడూ మతం పేరుతో రాజకీయాలు చేయలేదని, దేశంలోనే అత్యంత సామరస్యంగా ఉండే నగరాల్లో హైదరాబాద్ ఒక్కటిగా నిలిపామని కేటీఆర్ వివరించారు. ఇలాంటి హైదరాబాద్ నగరాన్ని మోదీ ఆగం చేయాలని చూస్తున్నారని, నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా చేసి.. లూటీ చేసే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని అడ్డుకోవాలంటే పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని కేటీఆర్ అన్నారు. 2014, 2019లో బీజేపీ గెలుపును అడ్డుకున్నది కేసీఆర్ మాత్రమేనని, 2023లో కూడా బీజేపీలోని పెద్ద పెద్ద లీడర్లను కూడా ఓడించింది కూడా బీఆర్ఎస్సేనని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది ఒక్క బీఆర్ఎస్ పార్టీయేనని అన్నారు.



కొండాపూర్ ఆర్టీఏ ఆఫీసు వద్ద కేటీఆర్ రోడ్ షోకు భారీగా హాజరైన జనం

### కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలె..

పొరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. అది బీజేపీకి వేసినట్టే అవుతుందని, ఎన్నికలయ్యాక రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్తారని కేటీఆర్ చెప్పారు. రేవంత్‌రెడ్డిని నమ్ముకుంటే ఒక్క హామీ కూడా అమలు కాదని, తులం బంగారం రాదు, మహిళలకు రూ. 2500లు, పింఛన్ రూ.4వేలు, కనీసం స్కూటీలు కూడా రావని ఎద్దేవా చేశారు.'ఇచ్చిన హామీలు అమలు చేయని రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ సర్కారుకు కర్రుకాల్చి వాత పెట్టాలె'.. అని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వచ్చాక కరెంటు కోతలు, తాగునీటి గోసలు వచ్చాయని, రియల్ ఎస్టేట్ ఢమాల్ అయిందన్నారు. కాంగ్రెస్ సర్కారుకు కొత్త కంపెనీలను తీసుకొచ్చే ముఖం లేదని, ఉన్న కంపెనీలు గుజరాత్, చెన్నైకి తరలిపోతున్నాయన్నారు. చిల్లర మాటలు, ఉద్దెర పనులే తప్ప.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం సీఎం రేవంత్‌రెడ్డితో కాదన్నారు. 'కాంగ్రెస్ తెచ్చిన మార్పు బాగాలేకపోతే ఆ పార్టీని చీరి చింతకు కట్టేయాలే' అని అన్నారు. 96 బీసీ కులాలను ఏకం చేసిన కాసానిని గెలిపించుకొని బీసీల చైతన్యం చూపాలన్నారు.

### మనసు నిండా కేసీఆర్‌పై ప్రేమ..

గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆరే సీఎంగా ఉండాలని గ్రేటర్ ప్రజలు కోరుకున్నారని, అందుకే కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని కేటీఆర్ అన్నారు. 16 సీట్లు ఇచ్చినందుకు హైదరాబాద్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించడంతో జిల్లాల్లో ప్రజలు కాస్త ఆగమయ్యారని.. అయితే మనసు నిండా కేసీఆర్ మీద ప్రేమ ఉన్నదన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేదని అనుకునేవాళ్లంతా 13న కారు గుర్తుపై ఓటేసి.. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10-12 సీట్లు అప్పజెప్పితే.. ఆరు నెలల్లో కేసీఆర్ మళ్లీ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని కేటీఆర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డితో పాటు సీనియర్ నాయకులు కార్తీక్‌రెడ్డి, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కంటోన్మెంట్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, నివేదిత తదితరులు

# కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

బొల్లారం, మే 6: కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ ప్రచారానికి అద్భుత స్పందన వస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. సోమవారం కంటోన్మెంట్‌లోని పలు వార్డుల్లో ప్రచారం చేసిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని మల్లారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితను భారీ మెజార్టీతో గెలిపించాలని మల్లారెడ్డి కోరారు. మల్కాజిగిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా నివేదితను గెలిపించుకొని కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ రోజు.. ర్యాపిడో 'ఫ్రీ' రైడ్

సిటీబ్యూరో: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనది. దాన్ని ఓటర్లు తప్పనిసరిగా వినియోగించుకోవాలి. ఇదే నినాదంతో పోలింగ్ రోజు మే 13న ఓటర్లకు ఆన్‌లైన్ ట్యాక్సీ సేవల సంస్థ ర్యాపిడో ఉచిత రవాణా సేవలను అందిస్తున్నది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని పటిష్టం చేయాలనే దృఢ సంకల్పంతో ర్యాపిడో ఉచిత రైడ్‌లను హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ వంటి ప్రధాన నగరాల్లో అందిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి పవన్ గుంటుపల్లి తెలిపారు. అతి పెద్ద ప్రజాస్వామ్య పండగలో ఓటు వేయడానికి ప్రజలను ప్రోత్సహించేందుకు ర్యాపిడో తెలంగాణ ప్రధాన ఎన్నికల కార్యాలయంతో కలిసి పని చేస్తోందని, ఎక్కువ మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడమే ఏకైక లక్ష్యమన్నారు.

### ఉచిత రైడ్ ఎలా వినియోగించుకోవాలంటే..

మే 13న రాష్ట్రంలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేసే ఓటర్లు 'వోట్ నౌ' కోడ్‌ను ఉపయోగించి.. ర్యాపిడో యాప్‌లో ఉచిత రైడ్‌లను పొందవచ్చు. పోలింగ్ రోజున ఉచిత రైడ్‌లను అందించేందుకు 100 కంటే ఎక్కువ నగరాల్లో 10 లక్షల మంది కెప్టెన్‌లను ర్యాపిడో అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ ఓటర్లకు ఉచితంగా ఆటో, క్యాబ్ రైడ్‌లు అందుబాటులో ఉంటాయని, ఇతర ఓటర్లకు బైక్ ట్యాక్సీలు ఉచిత రైడ్‌ను కల్పిస్తాయని చెప్పారు.

### ర్యాపిడో ఉచిత రైడ్లు అభినందనీయం: సీఈవో వికాస్ రాజ్

పోలింగ్ రోజు ర్యాపిడో ఓటర్ల కోసం ఉచిత రైడ్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాజ్ రాజ్ అన్నారు. సోమవారం ఎల్బీ స్టేడియంలో 'ర్యాపిడో బైక్ ట్యాక్సీ ఉచిత రైడ్లు' ర్యాలీ కార్యక్రమాన్ని ఆయన హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ 60-65 శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని వికాస్ రాజ్ అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు విశేష కృషి చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ర్యాపిడో బిజినెస్ హెడ్ రోహిత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్, నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గన్‌ఫౌండ్రిలోని ఆల్ సెయింట్స్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించారు. హోం ఓటింగ్‌లో ఆదివారం నాటికి 571 ఓటర్లకు 479 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు.



ఎల్బీ స్టేడియంలో ర్యాపిడో 'ఉచిత బైక్ ట్యాక్సీ రైడ్లు' ర్యాలీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, చిత్రంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్, నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

### పోలింగ్‌కు చకచకా ఏర్పాట్లు

హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంటు ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించి బల్దియా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 3986 పోలింగ్ స్టేషన్లలో పటిష్ట చర్యలు తీసుకున్నారు. 12231 బ్యాలెట్ యూనిట్లు, 4978 కంట్రోల్ యూనిట్లు, 5575 వీవీ ప్యాట్లను అందుబాటులో ఉంచారు. 20వేల మంది సిబ్బంది, 1200 మంది మైక్రో అబ్జర్వర్లుతో పాటు దాదాపు 6వేల మంది పోలీస్ సిబ్బంది ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నారు.